సాక్షి జగిత్యాల
శనివారం । 26 । ఆగస్టు । 2023



భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీవ్రతం

పెగడపల్లి(ధర్మపురి): జిల్లావ్యాప్తంగా వివిధ ఆలయాల్లో మహిళలు శుక్రవారం వరలక్ష్మీవ్రతం అత్యంత భక్తిశ్రద్ధలతో నోముకున్నారు. అమ్మవారికి ప్రత్యేకపూజలు చేశారు. తమ పసుపు, కుంకుమలను చల్లంగా చూడాలని, అష్ట ఐశ్వర్యాలు సమకూర్చాలని మొక్కుకున్నారు. అనంతరం పసుపు, కుంకుమలు వాయినాలుగా ఇచ్చుకున్నారు.

న్యూస్‌రీల్

కాంగ్రెస్ టికెట్‌కు ‘అడ్లూరి’ దరఖాస్తు


దరఖాస్తు చేసుకుంటున్న లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి: ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడానికి డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శుక్రవారం హైదరాబాద్ గాంధీభవన్‌లో కాంగ్రెస్ అధిష్టానానికి దరఖాస్తు చేసుకున్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నేషనల్ వర్కింగ్ కమిటీ శాశ్వత సభ్యుడు దామోదర్ రాజనర్సింహను మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించారు. అడ్లూరితోపాటు నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన కాంగ్రెస్ అధ్యక్షులు దినేశ్, శైలేందర్‌రెడ్డి, రాములుగౌడ్, శ్రీనివాస్, నిశాంత్ యూత్ అధ్యక్షుడు ప్రసాద్ తదితరులు ఉన్నారు.

నలుగురే రెగ్యులర్ డీఈవోలు


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: రాష్ట్రంలోని 33 జిల్లాల్లో నలుగురే రెగ్యులర్ జిల్లా విద్యాధికారులు ఉడడం శోచనీయమని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం స్థానిక ఇందిరాభవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ విద్య అమలును పర్యవేక్షించి, బలోపేతం చేయాల్సిన డీఈవో, డిప్యూటీ డీఈవో, ఎంఈవో పోస్టులను భర్తీ చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని వివిధ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 22వేల టీచర్ పోస్టులను భర్తీచేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని కోరారు. ఉపాధ్యాయ నియామక ప్రక్రియ పూర్తయ్యేంత వరకూ విద్యావలంటీర్ల సేవలు కొనసాగించాలని డిమాండ్ చేశారు. నాయకులు గిరి నాగభూషణం, బండ శంకర్, కల్లెపెల్లి దుర్గయ్య, గాజంగి నందయ్య, గాజుల రాజేందర్, పుప్పాల అశోక్, జున్ను రాజేందర్, మన్సూర్, చందా రాధాకిషన్, చాంద్‌పాషా తదితరులు ఉన్నారు.

‘చలో కోకాపేట’ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

జగిత్యాలజోన్: జిల్లా కేంద్రంలో పెరిక సామాజిక వర్గం నాయకులు శుక్రవారం చలో కోకాపేట పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. హైదరాబాద్ కోకాపేటలో ప్రభుత్వం కేటాయించిన స్థలంలో పెరిక కులస్తుల ఆత్మగౌరవ భవన నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేస్తారన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు కోరారు. ఇందుకోసం గ్రామ గ్రామన విస్తృత ప్రచారం చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పెరిగిక సంఘం నాయకులు బోడ్డు లక్ష్మణ్, అంకతి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యబంధు పథకం ప్రవేశపెట్టాలి



వినతిపత్రం అందిస్తున్న ఆర్యవైశ్యులు

ధర్మపురి: తమ సామాజిక వర్గానికి ఆర్యవైశ్య బంధు పథకం వెంటనే ప్రవేశ పెట్టాలని ఆ సంఘం నాయకులు కోరారు. ఈమేరకు స్థానిక తహసీల్దార్ కృష్ణచైతన్యకు శుక్రవారం ఒక వినతిపత్రం అందజేశారు. అనంతరం పలువురు నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్త సురేశ్ సూచనల మేరకు జిల్లాలోని ప్రతీ తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాలు అందజేశామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల, పట్టణ శాఖ అధ్యక్షులు కూరగాయల సంతోష్, మురికి శ్రీనివాస్, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు జక్కు పద్మ, ఏఎంసీ వైస్ చైర్మన్ అక్కెనపెల్లి సునీల్‌కుమార్, మహిళా సంఘం అధ్యక్షురాలు గందె పద్మ, వాసవీ సేవాదళ్ అధ్యక్షుడు ముత్యపు రమేశ్, దేవస్థానం కమిటీ సభ్యుడు గునిశెట్టి రవీందర్, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఆరైనా ‘హస్తగతం’ కావాలి!

- ఉమ్మడి జిల్లాలో సత్తా చాటేందుకు కాంగ్రెస్ వ్యూహం
- 13 స్థానాల్లో ఆరుచోట్ల విజయంపై ధీమా
- నెలాఖరున పార్టీలో చేరనున్న మాజీ ఎంపీ జి.వివేక్?
- గాంధీభవన్‌లో 40కిపైగా దరఖాస్తులు, గరిష్టంగా కరీంనగర్‌కు..
- పారిశ్రామికవేత్తల చేరికలతో పార్టీ బలోపేతంపై ధీమా

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:



కర్ణాటక ఎన్నికల ఫలితాలతో కొత్త ఉత్సాహంతో ఉన్న తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో ఈసారి సానుకూల పవనాలు వీస్తున్నాయి. రాబోయే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాను ఇటీవల బీఆర్‌ఎస్ ప్రకటించిన దరిమిలా.. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల వాతావరణం మొదలైంది. దీంతో ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ కూడా బరిలో నిలిచే అభ్యర్థుల కోసం దరఖాస్తులు ఆహ్వానించింది. పాత కరీంనగర్ జిల్లాలో ఈసారి ఎలాగైనా కనీసం ఆరు స్థానాలు సాధించాలన్న వ్యూహంతో మెరికల్లాంటి అభ్యర్థులను రంగంలోకి దింపే పనిలో ఉంది. ప్రభుత్వ వ్యతిరేకత, సీనియర్లపై సానుభూతి, కొత్తగా పార్టీలోకి చేరుతున్న నాయకగణం తదితర కారణాలు ఈసారి జిల్లాలో తమకు గౌరవప్రదమైన సంఖ్యలో ఎమ్మెల్యేలను గెలిపిస్తాయని అధిష్టానం బలంగా నమ్ముతోంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 13 అసెంబ్లీ స్థానాల్లో తమకు ఎంతలేదన్నా.. కనీసం ఆరేడుకు తగ్గకుండా గెలిచి తీరుతామన్న ధీమాతో కాంగ్రెస్ ముందుకెళ్తోంది.

ఈ స్థానాలు కీలకం..!

ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వ్యూహకర్త సునీల్ కనుగోలు, థర్డ్ పార్టీ సర్వేల అనంతరం పెద్దపల్లి(విజయరమణారావు), మంథని(దుద్దిళ్ల శ్రీధర్‌బాబు), రామగుండం(రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్), ధర్మపురి(అడ్లూరి లక్ష్మణ్), వేములవాడ(ఆది శ్రీనివాస్), హుస్నాబాద్(పొన్నం ప్రభాకర్),జగిత్యాల(జీవన్‌రెడ్డి) స్థానాల్లో తమ అభ్యర్థులు బలంగా ఉన్నారని, అధికార బీఆర్‌ఎస్‌కు గట్టి పోటీ ఇస్తారని కాంగ్రెస్ ధీమాగా ఉంది. చొప్పదండి(మేడిపల్లి సత్యం), మానకొండూరు(కవ్వంపల్లి సత్యనారాయణ), సిరిసిల్ల (కేకే మహేందర్ రెడ్డి), కోరుట్ల(జువ్వాడి నర్సింగరావు) కూడా ఈసారి తమకు స్థానికంగా సానుకూల పరిస్థితులు ఉన్నాయని నమ్ముతున్నారు. హుజూరాబాద్ నుంచి మరోసారి బల్మూరి వెంకట్ బరిలోకి దిగనున్నారన్న ప్రచారం నడుస్తోంది. అన్నింటికంటే చివరిగా కరీంనగర్ స్థానంపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈ స్థానానికి పార్టీలో తీవ్రపోటీ నెలకొంది. మాజీ మంత్రి ఎమ్మెస్సార్ మనవడు మేనేని రోహిత్, పొన్నం ప్రభాకర్ మధ్య పోటీ ఉన్నా.. పొన్నం హుస్నాబాద్‌కు వలస వెళ్లడంతో రోహిత్‌కు దాదాపుగా రూట్ క్లియర్ అయింది. అదేసమయంలో మైత్రీ గ్రూప్స్ అధినేత కొత్త జయపాల్‌రెడ్డి పార్టీలో చేరడంతో మరో ఆశావహుడు పెరిగినట్లయింది. దరఖాస్తుల పరంగా చూసినా.. కరీంనగర్‌కు ఆశావహుల జాబితా చాంతాడంత ఉంది, తర్వాత స్థానంలో కోరుట్లకు పోటీ ఉంది.

కాంగ్రెస్ గూటికి మాజీ ఎంపీ వివేక్!?

పెద్దపల్లి మాజీ పార్లమెంట్ సభ్యుడు గడ్డం వివేక్ వెంకటస్వామి మరోసారి పార్టీ మారనున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. ఈనెల 30వ తేదీ తర్వాత ఆయన కాంగ్రెస్‌లో చేరబోతున్నారు. కేంద్ర మాజీమంత్రి జి.వెంకటస్వామి రాజకీయ వారసుడిగా 2009లో పెద్దపల్లి ఎంపీగా గెలిచారు. 2014లో కాంగ్రెస్ నుంచి ఓడాక బీఆర్‌ఎస్‌లో చేరి ప్రభుత్వ సలహాదారుగా పనిచేశారు. 2018 ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థుల ఓటమి కోసం ప్రయత్నించారన్న విమర్శలతో పార్టీ ఆయనను పక్కనబెట్టింది. అప్పటినుంచి ఆయన బీజేపీలో కొనసాగుతున్నారు. ఐదేళ్లుగా జాతీయ పార్టీలో పనిచేసినా సరైన ప్రాధాన్యం దక్కలేదన్న ఆవేదనతో తిరిగి మాతృపార్టీ కాంగ్రెస్‌కు దగ్గరయ్యేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.


మాజీ ఎంపీ వివేక్

ఈ క్రమంలోనే పార్టీలో హస్తం పార్టీ నుంచి ఆయనకు గ్రీన్‌సిగ్నల్ వచ్చిందని, 2024 పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి సీటు ఇస్తామన్న హామీతో ఆయన కాంగ్రెస్‌లో చేరబోతున్నారని తెలిసింది. అంగబలం, అర్థబలం దండిగా ఉన్న వివేక్ పార్టీలో చేరితే.. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని అన్నిస్థానాల అభ్యర్థులకు అండగా నిలుస్తారని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి.

దరఖాస్తులు ఇలా

కరీంనగర్: 1.కొనగాల మహేశ్, 2.కర్ర సత్య ప్రసన్నరెడ్డి, 3.సమద్‌నవాబ్, 4.రేగులపాటి రమ్యరావు, 5.కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, 6.వైద్యుల అంజన్‌కుమార్, 7.మేనేని రోహిత్‌రావు, 8.రహమత్ హుస్సేన్, 9.పాడాల రాహుల్, 10.కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, 11.కొత్త జైపాల్‌రెడ్డి

హుజూరాబాద్: 1.బల్మూరి వెంకట్, 2. పత్తి కృష్ణారెడ్డి, 3. దాసరి భూమయ్య , 4. సాయిని రవి

మానకొండూరు: 1. కవ్వంపల్లి సత్యనారాయణ

చొప్పదండి: 1. వెన్న రాజ మల్లయ్య, 2. బండ శకుంతల, 3. నాగి శేఖర్

హుస్నాబాద్: పొన్నం ప్రభాకర్

జగిత్యాల: 1.తాటిపర్తి జీవన్‌రెడ్డి, ఎమ్మెల్సీ

ధర్మపురి: 1.గజ్జల స్వామి, 2. మద్దెల రవీందర్, 3.బండారి కనుకయ్య, 4. అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, 5.వడ్లూరి కృష్ణ, 6. బొల్లి స్వామి

కోరుట్ల: 1. జువ్వాడి నరసింగరావు, 2. కొమిరెడ్డి జ్యోతక్క, 3. కల్వకుంట్ల సుజిత్ రావు, 4. కోమిరెడ్డి కరంచంద్ , 5. కాటిపల్లి శ్రీనివాసరెడ్డి, 6. మహమ్మద్ షాకీర్, 7. సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి

పెద్దపల్లి: 1. చింతకుంట విజయరమణారావు, 2. గంట రాములు యాదవ్, 3. ఈర్ల కొమురయ్య

మంథని: 1.దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, 2.ప్రమోద్‌కుమార్

రామగుండం: 1. ఎంఎస్ రాజ్ ఠాకూర్, 2. జనక్ ప్రసాద్, 3. రియాజ్ అహ్మద్, 4. వెంచర్ల మహేశ్

సిరిసిల్ల: 01. కే.కే మహేందర్ రెడ్డి, 02. చీటీ ఉమేశ్ రావు, 03. సంగీతం శ్రీనివాస్, 04. నాగుల సత్యనారాయణ గౌడ్

వేములవాడ: 1. ముడిక చంద్రశేఖర్, 2. తొట్ల అంజయ్య, 3. సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి

నిబంధనలు పాటించాలి

- కలెక్టర్ యాస్మిన్ బాషా


మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నందున రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు నడుచుకోవాలని, ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకోవాలని కలెక్టర్ యాస్మిన్ బాషా సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం వివిధ శాఖల అధికారులతో ఆమె ఎన్నికల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో నగదు, మద్యం, ఉచితాలు మొదలైన వాటి పంపిణీపై పెద్దసంఖ్యలో ఫిర్యాదులు రాకుండా, సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎక్సైజ్, పోలీసు, ఆర్టీవో, ఈఆర్వోలు ఎప్పటికప్పుడు ఈ మేరకు చర్యలు తీసుకోవాలని అన్నారు. అధిక మొత్తంలో నగదు, మద్యం, డ్రగ్స్, మాదక ద్రవ్యాలపై ఎప్పటికప్పుడు దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ భాస్కర్, అదనపు కలెక్టర్లు లత, దివాకర, అధికారులు పాల్గొన్నారు.

సంఘాల బలోపేతానికి కృషి

- జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నరేశ్


మాట్లాడుతున్న నరేశ్

జగిత్యాలరూరల్: మహిళా సంఘాల బలోపేతానికి అందరూ కృషి చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నరేశ్ సూచించారు. శుక్రవారం మండల సెర్ప్ కార్యాలయంలో సిబ్బంది, మండల సమాఖ్యలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన స్వశక్తి మహిళా సంఘాల అభివృద్ధికి ఆర్థిక, సామాజిక సేవలు అందించాలని అన్నారు. ప్రతీ అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. ప్రస్తుతం ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని, కోటి మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, స్వచ్ఛ సర్వేక్షణ్‌ను అగ్రస్థానంలో నిలపాలని చెప్పారు. బ్యాంక్ లింకేజీ ద్వారా తీసుకున్న రుణాలతో ఆదాయాభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ సుధీర్, డీపీఎంలు వెంకటేశ్, మాణిక్‌రెడ్డి, ఏపీఎం గంగాధర్, సీసీలు గంగారాం, రవీందర్, సాగర్ పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంల వరలక్ష్మీవ్రతం



వరలక్ష్మీవ్రతం చేస్తూ నిరసన తెలుపుతున్న రెండో ఏఎన్‌ఎంలు

- ఉద్యోగాలు క్రమబద్ధీకరించేలా చూడాలని పూజలు

జగిత్యాలటౌన్: సుమారు 16ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో కాలం వెళ్లదీస్తున్న తమ సేవలను గుర్తించి గుర్తించి వెంటనే క్రమబద్ధీకరించాలని తెలంగాణ కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాండ్ల మధురిమ డిమాండ్ చేశారు. నిరవధిక సమ్మెలో పాల్గొంటున్న రెండో ఏఎన్‌ఎంలు.. శుక్రవారం పదోరోజు జిల్లా కేంద్రంలో దీక్ష శిబిరంలో వరలక్ష్మీవ్రతం చేసి నిరసన తెలిపారు. సీఎం కేసీఆర్ మనసు మార్చి తమ ఉద్యోగాలు పర్మినెంట్ చేసేలా ఆశీర్వదించాలని అమ్మవారిని వేడుకున్నారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా ఇళ్లలో కుటుంబ సభ్యులతో కలిసి వరలక్ష్మీవ్రతం నోముకోవాల్సి ఉందని, కానీ, తాము రోడ్డుపైనే వ్రతం చేయాల్సి రావడం ఆవేదన కలిగించిందని అన్నారు. తమ బంధువులు, తోబుట్టువులు, ఇరుగు పొరుగు వారికి వాయినాలు ఇచ్చి పండుగ జరుపుకోవాల్సిన తాము.. ఇలా రోడ్డెక్కి ఆందోళనలు చేయాల్సిన దుస్థితి వచ్చిందని ఆవేదన చెందారు. తమను కాదని కొత్తగా నోటిఫికేషన్ జారీచేయడం సరికాదన్నారు. ఆర్టీసీ, వీఆర్‌ఏ, పంచాయతీ కార్యదర్శులు, కాంట్రాక్టు లెక్చరర్లు, ఫార్మసిస్టులు, హెల్త్ అసిస్టెంట్లను రెగ్యులరైజ్ చేసిన ఉద్యమ నాయకుడు సీఎం కేసీఆర్.. ఆడబిడ్డలమైన తమను ఆశీర్వదించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రెండో ఏఎన్‌ఎంలు గూడూరి జయప్రద, మమత, సుప్రియ, నీరజ, పద్మ, రాజమని, మేరి, ఎలిజబెత్, శిరీష, ప్రశాంతి, శైలజ, శిరీష పాల్గొన్నారు.

మహిళల రక్షణే షీటీం లక్ష్యం

- సైబర్ నేరాలపై ఫిర్యాదు చేయండి
- షీటీం ఏఎస్సై అలీబేగ్



మాట్లాడుతున్న ఏఎస్సై వెంకటేశ్వర్లు

జగిత్యాలక్రైం: మహిళల రక్షణ కోసం షీటీం నిరంతరం కృషి చేస్తుందని షీటీం ఏఎస్సై అలీబేగ్ అన్నారు. శుక్రవారం స్థానిక తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్, జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. మహిళలపై జరిగే నేరాలపై వెంటనే బాధితులు పోలీసులను సంప్రదించాలన్నారు. విద్యారినులు, మహిళలు అన్యాయానికి గురైనప్పుడు భయపడొద్దని, ధైర్యంగా ముందుకొచ్చి పోలీసులకు ఫిర్యాదు చేస్తే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎలాంటి సమస్య ఉన్నా షీటీం నంబరు 87126 70783కు ఫోన్‌చేసి సమాచారం అందించాలని సూచించారు. ఫేస్‌బుక్, వాట్సప్, ఇన్‌స్టాగామ్ వినియోగంలో చాలాజాగ్రత్తగా ఉండాలని చెప్పారు. ఫొటోలు, వీడియోలు పోస్టు చేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించిన అన్నిరకాల చర్యలు తీసుకోవాలని సూచించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరాల బారినపడితే వెంటనే టోల్‌ఫ్రీ నంబరు 1930, లేదా డయల్ 100కు ఫోన్‌చేసి సమాచారం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు కానిస్టేబుళ్లు సౌజన్య, మంజూ పాల్గొన్నారు.

అధిష్టానం రూ.కోట్లు ఇచ్చిందనడం అవాస్తవం

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: బీఆర్‌ఎస్ పార్టీ హైకమాండ్ అభ్యర్థులను ప్రకటించి, వారికి రూ.కోట్లు ఇస్తోందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆరోపించడం సమంజసం కాదని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీనియర్ నాయకుడు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తనస్థాయికి తగిన మాటలు మాట్లాడాలని సంజయ్‌కుమార్ హితవు పలికారు. తనకు హైదరాబాద్‌లో ఆస్తులు ఉన్నాయని, వందల ఎకరాలు ఉన్నాయని అన్నీ తెలిసి జీవన్‌రెడ్డి తనపై అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. జీవన్‌రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల్లో రూ.కోట్లు ఖర్చు చేసి ఎలా యాడ్స్ ఇచ్చారని, అంత మొత్తంలో డబ్బు ఎలా వచ్చిందని ప్రశ్నించారు. దివంగత ఇందిరాగాంధీని దూషించి రాజకీయాల్లోకి వచ్చిన జీవన్‌రెడ్డి.. ఆమె చనిపోయాక కాంగ్రెస్ పార్టీలో చేరి నీతిసూక్తులు వల్లించడం సమంజసం కాదన్నారు. ఎన్టీఆర్ భిక్ష పెడితే.. నాందేడ్ల భాస్కర్‌రావు చెంతన చేరింది నిజం కాదా? అని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీవారు అంతనీతివంతులా? అని ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ మిత్తికే పోయిందని అబద్ధపు ప్రచారం చేస్తున్నారని, ‘మీకు రుణమాఫీ కాలేదా?’ పత్రిక ముఖంగా ప్రకటించాలని సంజయ్ సవాల్ విసిరారు. నర్సింగాపూర్ గ్రామంలో మాస్టర్‌ప్లాన్ రద్దు చేసినా అబద్ధాలు చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు బాలముకుందం, మహేశ్, సురేశ్, గంగాధర్, మహిపాల్‌రెడ్డి, నక్కల రవీందర్‌రెడ్డి, చెరుకు జాన్ తదితరులు పాల్గొన్నారు.

పైరవీల జోరు!


కారుణ్య నియామకం పొందిన ఉద్యోగులతో జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత

- కారుణ్య నియామకాల్లో లంచాలు
- సమీప పాఠశాలల్లో పోస్టింగ్‌లు
- ఒక్కోదానికి రూ.40వేల వరకు డిమాండ్?

జగిత్యాల: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టాలని ప్రభుత్వం ఇటీవల ఆదేశాలు జారీచేసింది. దీంతో జిల్లావ్యాప్తంగా 31మంది అర్హులు ఉన్నట్లు జిల్లా అధికారులు ఇటీవల జాబితా సిద్ధం చేశారు.

సుదూర ప్రాంతాలకు మహిళలు..

- జిల్లా కేంద్రానికి సమీపంలోని జెడ్పీ హైస్కూళ్లలో అత్యధిక ఖాళీలు ఉన్నాయి.
- ఈ పాఠశాలల్లో పోస్టింగ్‌లు వచ్చేలా కొందరు అభ్యర్థులు ప్రజాప్రతినిధుల సన్నిహితులను ఆశ్రయించారని, వారితో అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చారని తెలిసింది.
- దీనిని ఆసరాగా చేసుకున్న సదరు సన్నిహితులు.. ఒక్కో అభ్యర్థి వద్ద రూ.30వేల నుంచి రూ.40వేలు లంచంగా ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు తెలిసింది.
- ఇలా చేతులు తడిపిన వారికి జగిత్యాలకు సమీప బడుల్లో పోస్టింగ్‌లు ఇచ్చారని, లంచాలు ఇవ్వని వారికి దూర ప్రాంతాల్లో పోస్టింగులు ఇచ్చారని ఆరోపణలు వస్తున్నాయి.
- దూర ప్రాంతాల్లో పోస్టింగ్‌లు ఇచ్చిన వారిలో మహిళలు ఉండడంతో చర్చకు దారితీసింది.
- వివిధ కారణాలతో మరణించిన ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబ సభ్యులకు ఆరు నెలల్లోపు ఉద్యోగం ఇవ్వాలనే నిబంధన ఉందని, అయితే, కరోనా, ఇతర కారణాలతో కొంతజాప్యం జరిగిందని ప్రభుత్వం ప్రకటించింది.
- సర్కారు ఆదేశాల మేరకు జిల్లాలో 31 మంది కారుణ్య నియామకాల కోసం అర్హులు ఉండగా, వారందరికీ గురువారం పోస్టింగ్ ఇచ్చారు.
- అయితే, ప్రజాప్రతినిధులు, తమ అనుచరులకు దగ్గరగా ఉన్న వారికే పోస్టింగుల్లో న్యాయం జరిగిందనే ఆరోపణలు వస్తున్నాయి.
- ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు.

కారుణ్య నియామక పత్రాలు అందజేత

జగిత్యాలజోన్: జిల్లాలో ఆఫీస్ సబార్డినేట్ పోస్టులను సూపర్ న్యూమరరీ పోస్టుల కింద మార్చి జూనియర్ అసిస్టెంట్లుగా నియమించారు. ఈమేరకు అర్హులైన 31 మందికి శుక్రవారం జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత నియామక పత్రాలు అందజేశారు. ఆమె మాట్లాడుతూ, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులను జూనియర్ అసిస్టెంట్ పోస్టులుగా అప్‌గ్రేడ్ చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో రామానుజాచార్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

28న జాబ్‌మేళా

జగిత్యాల: ప్రైవేటు రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ఈనెల 28న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి సత్తమ్మ శుక్రవారం తెలిపారు. 25ఏళ్లకు పైబడి ఇంటర్ చదివినవారు అర్హులన్నారు. జిల్లా కేంద్రంలోని ఉపాధికల్పన కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 80086 09868 మొబైల్ నంబరులో సంప్రదించాలని ఆమె సూచించారు.

నత్తనడకన రోడ్ల పనులు


పనులు నిలిచిపోయిన జైనా ప్రధాన రహదారి


14వ వార్డులో గుంతల రోడ్డు

- వర్షం కురిస్తే గుంతల్లో నీరు చేరి చిత్తడి
- ధర్మపురిలో రాకపోకలకు స్థానికులు, భక్తుల ఇబ్బందులు
- అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యమే కారణమని ఆరోపణలు

ధర్మపురి: మున్సిపాలిటీలో చేపడుతున్న అభివృద్ధి పనులతో రోడ్లు అస్తవ్యస్తంగా మారాయి. అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో సకాలంలో పూర్తవకపోవక ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు, వాహనదారులు ఆరోపిస్తున్నారు. మేజర్ పంచాయతీగా ఉన్న ధర్మపురి మున్సిపాలిటీగా మారింది. ఇందుకు తగ్గట్టుగా రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రత్యేక చొరవతో పట్టణంలో అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నారు. వాటిని దక్కించుకున్న కాంట్రాక్టర్లు పూర్తి చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. ధర్మపురి లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి, గోదావరి పుణ్యస్నానాలకు నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారు. సరైన రోడ్డు సౌకర్యం లేక వారు నానాతంటాలు పడుతున్నారు.

15 వార్డులు.. 85 రోడ్లు

ధర్మపురి పట్టణంలోని 15 వార్డుల్లో 20,690 మంది జనాభా ఉంది. మొత్తం 85 రోడ్లు ఉండగా వీటిలో ప్రధానమైనవి 5, చిన్నపాటి రోడ్లు 80. కమలాపూర్ రూట్, జైనా, అంబేడ్కర్ విగ్రహం నుంచి బస్టాండ్‌కు వెళ్లే, నంది టు హరిత హోటల్, జాతీయ రహదారి నుంచి ప్రభుత్వ ఆస్పత్రి వరకు ఉన్నవి ప్రధానమైన రోడ్లు. ఈ దారుల్లో చేపడుతున్న సీసీ పనులు కాంట్రాక్టర్ల అలసత్వంతో నత్తనడకన సాగుతున్నాయి. రోడ్లకిరువైపులా కంకర పోసి, నెలలు గడుస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. రోడ్లు గుంతలుగా మారి, చిన్నపాటి వర్షం కురిసినా చిత్తడిగా మారుతున్నాయి. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి బస్టాండ్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో ఆర్టీసీ బస్సులతోపాటు ఏ ఒక్క వాహనాన్నీ వెళ్లనివ్వకుండా దారిని మూసివేసి, పనులు కొనసాగిస్తున్నారు. మిగిలిన రహదారుల్లో పనులు నిలిచిపోయాయి. పట్టణంలో బ్రాహ్మణ వీధులు, ముస్లిం కాలనీ, మంగళివాడ, ఎస్సీ కాలనీ తదితర చిన్న రోడ్లు ఉన్నాయి. మిషన్ భగీరథ పనులతో ఇవి పనికిరాకుండా పోయాయి. చాలావరకు తాగునీటి పైపులైన్లు ధ్వంసమయ్యాయి. ఏ గల్లీ చూసినా రోడ్లు గుంతలు, స్పీడ్ బ్రేకర్లతో నిండిపోయాయి. స్థానికులు, ప్రయాణికులు నడిచేందుకు, వాహనాలపై వెళ్లేందుకు నరకం చూస్తున్నారు. రోడ్ల సమస్యను పరిష్కరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ప్రణాళిక లేని పనులు



ధర్మపురిలో రోడ్ల పనులను ఒక ప్రణాళిక లేకుండా చేపడుతున్నారు. దీంతో స్థానికులు, భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. గల్లీల్లో చేపడుతున్న పనులను సకాలంలో పూర్తి చేయకపోవడంతో కనీసం నడిచే పరిస్థితి లేదు.

– రంగు లక్ష్మీనరహరి, ధర్మపురి

నోటీసులు జారీ చేశాం



ధర్మపురి పట్టణంలో చేపడుతున్న రహదారుల పనులతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమే. త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేశాం. పూర్తయ్యేలా చూస్తాం.

– రమేశ్, మున్సిపల్ కమిషనర్, ధర్మపురి

గంజాయి రవాణాదారులపై ఉక్కుపాదం

- ముగ్గురి అరెస్టు
- 13 కిలోల గంజాయి స్వాధీనం
- ఎస్పీ ఎగ్గడి భాస్కర్


పొట్టకు గంజాయి కట్టుకున్న నిందితుడిని చూపుతున్న పోలీసులు

జగిత్యాల క్రైం: గంజాయి రవాణాదారులపై ఉక్కుపాదం మోపుతామని ఎస్పీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. శుక్రవారం జగిత్యాలలోని ట్రాఫిక్ శిక్షణ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహారాష్ట్రలోని అమరావతి జిల్లా గులుస్తానగర్‌కు చెందిన అనిస్‌ఖాన్, ఫిరోజ్‌ఖాన్, చాందూర్ బజార్ మండలం తుగావ్‌కు చెందిన ఫిరోజ్‌ఖాన్ కొంతకాలంగా ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల సరిహద్దుల్లో గుర్తు తెలియని వ్యక్తుల వద్ద నుంచి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి, అమరావతిలో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారని తెలిపారు. ఈ నెల 24న 13 కిలోల గంజాయిని మహారాష్ట్రకు తీసుకెళ్తుండగా కోరుట్ల పట్టణ శివారులోని వెటర్నరీ కళాశాల వద్ద కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై కిరణ్‌కుమార్‌లు వాహనాల తనిఖీ చేపట్టారని పేర్కొన్నారు. రెండు బైక్‌లపై ఉన్న ఆ ముగ్గురిపై అనుమానం రావడంతో ఆపి, క్షుణ్ణంగా పరిశీలించారని తెలిపారు. నిందితులు తమ పొట్ట భాగంలో బ్యాగులు అమర్చుకొని, గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించారు. వారిని పట్టుకున్న సీఐ, ఎస్సై, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

దారి దోపిడీ కేసులో ముగ్గురు..

జిల్లాలో గత కొంతకాలంగా ఒంటరిగా ప్రయాణిస్తున్న మహిళలను లక్ష్యంగా చేసుకొని దారి దోపిడీకి పాల్పడుతున్న ముఠాను పట్టుకున్నట్లు ఎస్పీ భాస్కర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. కోరుట్లకు చెందిన దంపతులు ఈ నెల 21న మేడిపల్లి మార్కెట్లో కూరగాయలు విక్రయించి, తిరిగి వెళ్తున్నారు. రాత్రి 8 గంటల సమయంలో వీరు ప్రయాణించే ఆటోలో ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులతోపాటు, ఓ బాలుడు ఎక్కారు. ఆ మహిళపై పెప్పర్ స్ప్రే చేసి, మెడలోని బంగారం, డ్రైవర్ జేబులో నుంచి డబ్బులు, తీసుకునే ప్రయత్నం చేయగా బాధితురాలు కేకలు వేసింది. దీంతో నలుగురూ అక్కడినుంచి పరారయ్యారు. పోలీసులు సీసీ పుటేజీలు పరిశీలించగా ఉత్తరప్రదేశ్ నుంచి వలస వచ్చి, కోరుట్ల పట్టణంలోని వెంకటాపూర్‌లో ఉండి, ఐస్‌క్రీమ్ అమ్మే ప్రకాశ్, దరోగ, అభిషేక్ రాజ్‌పుత్‌తోపాటు ఓ మైనర్‌గా గుర్తించారు. గతేడాది అక్టోబర్ 30న మెట్‌పల్లి పాత బస్టాండ్ నుంచి కోరుట్ల వైపు వెళ్తుండగా మారుతినగర్ వద్ద ఆటోను ఆపి, మహిళ మెడలోంచి మూడు తులాల బంగారు గొలుసు ఎత్తుకెళ్లారు. ఈ నేపథ్యంలోనే నిందితులు మెట్‌పల్లి బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా సీఐ లక్ష్మీనారాయణ తన సిబ్బందితో వెళ్లి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రెండు పెప్పర్ స్ప్రే బాటిళ్లు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని, బాలుడు పరారీలో ఉన్నాడని ఎస్పీ పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ప్రభాకర్‌రావు, ఎస్సైలు చిరంజీవి, కిరణ్ పాల్గొన్నారు.

‘ఇంగ్లిష్’కూ ప్రాక్టికల్స్

- ఇంటర్ ఫస్టియర్‌లో అమలుకు నిర్ణయం
- జిల్లాలోని 75 కళాశాలల్లో నిర్వహణకు ఏర్పాట్లు



ధర్మపురి: ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఆధునిక బోధన అమలుకు ఇంటర్ బోర్డు నిర్ణయించింది. గతంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో భౌతిక, రసాయన, వృక్ష, జీవ శాస్త్రాలతో పాటు వృత్తి విద్యా కోర్సులకు ప్రయోగ పరీక్షలు నిర్వహించేవారు. కాగా ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లిష్ సబ్జెక్టుపై ప్రాక్టికల్స్ నిర్వహించేందుకు బోర్డు ఏర్పాట్లు చేస్తుంది. అందుకు అవసరమైన విద్యా సామగ్రి పంపిణీకి ఏర్పాట్లు చేశారు. ఇంగ్లిష్ ప్రాక్టికల్స్‌తో విద్యార్థుల్లో భాషపై పట్టు పెరగడమే కాకుండా రానున్న రోజుల్లో ఈ విధానం వారికెంతో దోహద పడుతుందని భావిస్తున్నారు.

ఫస్టియర్ విద్యార్థులు దాదాపు 6,700 మంది

జిల్లాలో మొత్తం 75 ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలున్నాయి. వాటిలో 15 ప్రభుత్వ, 13 మోడల్, 7 కేజీబీవీ, 5 మైనార్టీ, 4 మహాత్మ జ్యోతిబాపూలే, 5 సోషల్ వెల్ఫేర్, 2 టీఎస్ఆర్‌జేసీ, 24 ప్రైవేట్ కళాశాలలున్నాయి. ఇంటర్ మొదటి సంవత్సరంలో దాదాపు 6,700 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఇంగ్లిష్‌కు మొదటి ప్రాధాన్యం కల్పించారు.

ఇంగ్లిష్ ప్రాక్టికల్స్‌కు 20 మార్కులు

ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఎప్పటి వలె పరీక్షకు మొత్తం 100 మార్కులుండగా వాటిలో ఇంగ్లిష్ ప్రాక్టికల్స్‌కు 20 మార్కులు, 80 మార్కులు రాత పరీక్షకు ఉంటాయి. మొత్తం 3 గంటల సమయం కేటాయించారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణతకు ప్రాక్టికల్స్ పరీక్షకు 7 మార్కులు, థియరీకి 28 మార్కులుగా నిర్ణయించారు.

ఉపయోగాలెన్నో..

ఇంగ్లిష్ ప్రాక్టికల్స్‌తో విద్యార్థులకెన్నో ఉపయోగాలున్నాయి. ముఖ్యంగా ఆంగ్లభాషపై పట్టు పెరుగుతుంది. మాట్లాడేందుకు భయం పోతుంది. ఎలా మాట్లాడాలో విద్యార్థులకు తెలుస్తుంది. భవిషత్‌లో ఉద్యోగ అవకాశాలు మెరుగుపడుతాయి.

భాషపై పట్టు పెరుగుతుంది



ప్రాక్టికల్స్ విధానంతో ఇంగ్లిష్ భాషపై పట్టు పెరుగుతుది. ఆంగ్లంలో మాట్లాడడానికి భయం ఉండదు. విదేశాలకు వెళ్లాలనుకునే వారికి ప్రయోగ పాఠం ఎంతో ఉపకరిస్తుంది. ప్రభుత్వ నిర్ణయం విద్యార్థులకెంతో దోహద పడుతుంది.

– రమేశ్‌బాబు, కళాశాల ప్రిన్సిపాల్, ధర్మపురి

నైపుణ్యాలు మెరుగుపడతాయి



ప్రాక్టికల్స్ పరీక్షలతో ఆంగ్ల భాష నైపుణ్యాలు మెరుగుపడతాయి. గ్రామీణ ప్రాంత విద్యార్థులు మాతృ భాషనే ఉపయోగిస్తారు. ఇతర భాషలను ఇష్టపడరు. ఈ ప్రాక్టికల్స్‌తో ఇంగ్లిష్‌లో నైపుణ్యం పెంపొందుతుంది.

– నారాయణ, ఇంటర్మీడియెట్ విద్యాధికారి

క్లుప్తంగా

మంత్రి కేటీఆర్, కోరుట్ల అభ్యర్థి క్లాస్‌మేట్స్


చిన్ననాటి మిత్రులతో సంజయ్ (ఎడమ వైపు), మంత్రి కేటీఆర్ (కుడి వైపు).. సర్కిళ్లలో..

కోరుట్ల: రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కేటీఆర్, కోరుట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ క్లాస్‌మేట్స్. గుంటూర్‌లోని విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ బైపీసీ చదివారు. అప్పుడు తమ స్నేహితులతో కలిసి దిగిన ఫొటోనే ఇది.

బోయినపల్లి, చెన్నమనేనిలను కలిసిన నాయకులు



కథలాపూర్: మేడిపెల్లి, బీమారం మండలాలకు చెందిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు హైదరాబాద్‌లో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబులను శుక్రవారం కలిశారు. వేములవాడ నియోజకవర్గంలో రాజకీయ పరిణామాలపై చర్చించినట్లు తెలిపారు. జెడ్పీ వైస్‌చైర్మన్ హరిచరణ్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సత్తిరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు ఉన్నారు.

కాంట్రాక్టు పనుల పేరిట మోసం

- మున్సిపల్ కాంట్రాక్టర్‌పై కేసు

కరీంనగర్‌క్రైం: కాంట్రాక్టు పనుల పేరిట డబ్బులు తీసుకొని, మోసం చేసిన వ్యక్తిపై కరీంనగర్ త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని వావిలాలపల్లికి చెందిన ముక్క శ్రీనివాస్ అనే వ్యాపారికి మున్సిపల్ కాంట్రాక్టర్ ఆవుల మధుకర్ పరిచయమయ్యాడు. తనకు కొన్ని కాంట్రాక్టు పనులు వచ్చాయని, డబ్బులు అవసరమున్నాయని శ్రీనివాస్ వద్దకు వచ్చాడు. ఆయన రూ.26 లక్షలు ఇచ్చాడు. రెండు ట్రాక్టర్లు, ట్రాలీలు, వాటర్ ట్యాంకర్లు, ఒక జేసీబీ ఇద్దరి భాగస్వామ్యంలో కొనుగోలు చేశారు. తర్వాత సదరు వాహనాలను మోసపూరితంగా మధుకర్ తనపేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. మొత్తం ఖర్చులు లెక్క చూసుకోగా మధుకర్ శ్రీనివాస్‌కు సుమారు రూ.92 లక్షల వరకు ఇవ్వాల్సి ఉంది. ఈ విషయమై పంచాయితీ జరగగా ఇస్తానని పెద్ద మనుషుల సమక్షంలో ఒప్పుకున్నాడు. తర్వాత డబ్బుల గురించి అడిగితే బెదిరింపులకు గురిచేస్తున్నాడని శ్రీనివాస్ శుక్రవారం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

దివ్యాంగుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్


ఉపకరణాలు అందించిన ఎమ్మెల్యే సంజయ్, కలెక్టర్ యాస్మిన్‌బాషా

జగిత్యాల: దివ్యాంగుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం భవిత సెంటర్‌లో 308 మంది దివ్యాంగ పిల్లలకు కృత్రిమ అవయవాలు, ఉపకరణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. వారికోసం అధిక నిధులు వెచ్చించి, ఉపకరణాలను ఉచితంగా పంపిణీ చేస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో 4 శాతం, సంక్షేమ పథకాల్లో 5 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నట్లు చెప్పారు. కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా మాట్లాడుతూ.. సమగ్ర శిక్ష అభియాన్‌లో సపరేట్ విభాగం నడుస్తోందన్నారు. ఇందులో భాగంగానే ప్రత్యేకంగా శిక్షణ పొందిన టీచర్లను నియమించుకొని, దివ్యాంగులకు చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ.. దివ్యాంగులకు ఆర్థిక భరోసా కల్పిస్తూ ప్రభుత్వం రూ.4 వేల పింఛన్ అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లత, మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్ చుక్క నవీన్, డీఈవో జగన్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీఎస్పీ జేఏసీ జిల్లా ఇన్‌చార్జిగా మహేశ్



కథలాపూర్(వేములవాడ): మండలంలోని దూలూర్ గ్రామానికి చెందిన కుంభం మహేశ్‌ను తెలంగాణ స్టూడెంట్ పొలిటికల్(టీఎస్పీ) జేఏసీ జిల్లా ఇన్‌చార్జిగా నియమిస్తూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంశీనాయక్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని విద్యార్థి, నిరుద్యోగ యువత చైతన్యం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఈ జేఏసీ ఏర్పడిందన్నారు. మహేశ్ గతంలో ఉస్మానియా, సెంట్రల్ యూనివర్సిటీల్లో విద్యార్థుల సమస్యలపై పోరాటం చేయడం వల్లే జిల్లా ఇన్‌చార్జిగా నియమించినట్లు పేర్కొన్నారు.

కేసీఆర్‌ను మళ్లీ సీఎం చేయాలి


మాట్లాడుతున్న అనిల్

రాయికల్: కేసీఆర్‌ను మళ్లీ సీఎం చేయడం కోసం ఎన్ఆర్ఐలు కృషి చేయాలని ఎన్ఆర్ఐ టీఆర్ఎస్ సెల్ అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర ఎఫ్‌టీసీ చైర్మన్ కూర్మాచలం అనిల్ కోరారు. శుక్రవారం ఎన్ఆర్ఐ టీఆర్ఎస్ సెల్ యూకే కార్యవర్గ సమావేశం లండన్‌లో నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. ఎన్నికల కమిటీ చైర్మన్‌గా నవీన్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా రవిలను ఎన్నుకున్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో సోషల్ మీడియాలో బీఆర్ఎస్ నాయకుల పాత్ర కీలకంగా మారనుందని తెలిపారు. ఎన్ఆర్ఐ యూకే అధ్యక్షుడు అశోక్‌గౌడ్, నాయకులు వెంకట్‌రెడ్డి, వినయ్, రవి, సురేశ్, సతీశ్‌రెడ్డి, దూసరి అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కోరుట్ల: పట్టణ శివారులోని ఓ మామిడితోటలో శుక్రవారం సాయంత్రం పేకాడుతున్న 11 మందిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. పక్కా సమాచారంతో దాడి చేశామన్నారు.

28న మహిళా క్రికెటర్ల ఓపెన్ సెలక్షన్స్

కరీంనగర్ స్పోర్ట్స్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28న ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో మహిళా క్రికెటర్లకు ఓపెన్ సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.ఆగంరావు, ఎన్.మురళీధర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-15, 19, 23 విభాగాల్లో మహిళా జట్ల ఎంపిక పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. అండర్-15కు 01-09-2008 నుంచి 31-08-2011 మధ్య, అండర్-19కు 01-09-2004 తర్వాత, అండర్-23కి హాజరయ్యే క్రీడాకారిణులు 01-09-2000 తర్వాత జన్మించినవారు అర్హులన్నారు. హెచ్‌సీఏ ఎంట్రీ ఫాం నింపి, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఒరిజినల్ వయసు ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, తమ సొంత కిట్, వైట్ డ్రెస్‌తో పోటీలకు హాజరు కావాలని సూచించారు. ఆసక్తి గల ఉమ్మడి జిల్లా మహిళా క్రికెటర్లు ఉదయం 10 గంటలకు ఉప్పల్ స్టేడియం గేట్ నంబర్ 2 నుంచి రిపోర్టు చేయాలన్నారు.

రెండు లారీలు ఢీ.. చెలరేగిన మంటలు

- లారీలోనే సజీవ దహనమైన డ్రైవర్.. తీవ్రగాయాలతో బయటపడ్డ క్లీనర్


మంటల్లో కాలిపోతున్న లారీలు


తీవ్రంగా గాయపడిన క్లీనర్ ఇంజిమామ్


సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామ శివారులోని రాజీవ్ రహదారిపై శుక్రవారం రాత్రి రెండు లారీలు ఢీకొని మంటలు చెలరేగాయి. మంటల్లో డ్రైవర్ సజీవ దహనం కాగా క్లీనర్ తీవ్ర గాయాలతో బయటపడ్డాడు. ఎస్సై విజేందర్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హరియానా రాష్ట్రం పాల్వల్ జిల్లా, హతిని తాలుకాకు చెందిన అన్నదమ్ములు ఫర్వీద్(25), ఇంజిమామ్ లారీ డ్రైవర్, క్లీనర్‌గా ఏలూరులో పని చేస్తున్నారు. ఏలూరు నుంచి ఏపీ 37టీఈ 5831 లారీలో టైల్స్ లోడ్ చేసుకొని మంచిర్యాల బయలుదేరారు. ఈక్రమంలో సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి పరిధిలో ఏపీ 29 టీబీ2382 నంబర్‌గల లారీ రాజీవ్ రహదారి పక్కనే ఉన్న మారుతి రైస్‌మిల్ నుంచి ధాన్యం లోడ్‌తో రోడ్డుపైకి వస్తున్న క్రమంలో టైల్స్ లోడ్‌తో ఉన్న లారీ వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. దీంతో ఒక్కసారిగా ఇంజిన్ నుంచి మంటల చెలరేగాయి. లారీ క్యాబిన్‌లో ఇరుక్కున్న ఫర్వీద్ మంటల్లోనే సజీవ దహనం కాగా, క్లీనర్ ప్రమాదాన్ని గుర్తించి కిందకు దూకి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈప్రమాదంతో ట్రాఫిక్ జామ్ అయింది. ఘటన స్థలానికి ఏసీపీ ఏడ్ల మహేశ్, సీఐ జగదీశ్‌లు చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

స్వగ్రామం చేరిన మృతదేహం


నివాళి అర్పిస్తున్న జువ్వాడి కృష్ణారావు

మెట్‌పల్లి రూరల్: మండలంలోని వేంపేట గ్రామానికి చెందిన ఒంటేరి రాంచందర్‌రెడ్డి(60) బహ్రెయిన్‌లో గుండెపోటుతో మృతి చెందగా మృతదేహం స్వగ్రామం చేరింది. వివరాల్లోకి వెళ్తే.. రాంచందర్‌రెడ్డి 10 నెలల క్రితం బహ్రెయిన్ వెళ్లి, అక్కడ ఓ హోటల్ లీజుకు తీసుకొని, నడిపిస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 22న గుండెపోటుతో మృతిచెందాడు. ఆయన మృతదేహం శుక్రవారం స్వగ్రామం చేరడంతో కుటుంబసభ్యులు, బంధువులు కన్నీటిపర్యంతమయ్యారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు నివాళి అర్పించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


కిషన్ (ఫైల్)

ధర్మపురి: గుర్తు తెలియని వాహనం ఢీకొని, ఓ యువకుడు మృతి చెందినట్లు ఎస్సై దత్తాత్రి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ధర్మపురి మండలంలోని రాయపట్నం గ్రామానికి చెందిన గొల్ల గౌరయ్య పెద్ద కుమారుడు కిషన్ (27) గురువారం రాత్రి బైక్‌పై రాయపట్నం నుంచి ధర్మపురి వెళ్తున్నాడు. బూరుగుపల్లె సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి, వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి వివాహం కాలేదు. ఒక సోదరుడు, సోదరి ఉన్నారు. తల్లిదండ్రులు కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. రేపోమాపో పెళ్లి చేసుకోవాల్సినోడివి కొడుకా.. మాకు దిక్కెవరంటూ కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడి తండ్రి గౌరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ప్రభుత్వ భూమిలో జెండాలు పాతిన పేదలు


ప్రభుత్వ భూమిలో చదును చేస్తున్న పేదలు

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్ శివారులోని నల్లగుట్ట సమీప సర్వేనంబరు 363లో 29 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉందని, దానిని వెంటనే నిరుపేద మహిళలకు పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కమిటి డిమాండ్ చేసింది. ఈమేరకు శుక్రవారం 150 మంది మహిళలు స్థలాన్ని చదును చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ, ఇళ్లులేని నిరుపేదలకు సర్కారు డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఇవ్వకుండా మోసం చేస్తోందన్నారు. కాగా, జెండాలు పాతిన స్థలం తిమ్మాపూర్, మోతె, జాబితాపూర్ శివారులో సర్వే నంబరు 72 కావడం, అది పట్టా భూమి కావడంతో రూరల్ ఆర్ఐ భూమయ్య, అర్బన్ ఆర్ఐ హరికిషన్‌రావు సంఘటన స్థలానికి చేరుకున్నారు. గుడిసెలు వేయవద్దని ఆందోళనకారులకు నచ్చజెప్పి ఆ ప్రాంతం నుంచి వెళ్లగొట్టారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు లెల్లెల్ల బాలకృష్ణ, నాయకులు గుగులోతు తిరుపతినాయక్, ఇందూరి సులోచన, రమేశ్, బూతం సారంగపాణి, బచ్చల, వినోద్, భైరం మనీష పాల్గొన్నారు.



గోదావరి తీరం.. భక్తజన సంద్రం

ధర్మపురి: స్థానిక గోదావరి తీరం శుక్రవారం భక్తజన సంద్రంగా మారింది. శ్రావణ శుక్రవారం సందర్భంగా పుణ్యస్నానాలకు వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. అనంతరం ఆలయాల్లో పూజలు చేశారు.